క్లుప్తంగా

డిగ్రీ అడ్మిషన్ల దరఖాస్తులకు ఆహ్వానం

పెద్దదోర్నాల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండో ఫేజ్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ మక్బుల్ హుస్సేన్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ 1వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. బీఎస్సీ మేజర్ సబ్జెక్ట్ కంప్యూటర్ సైన్స్, మైనర్ సబ్జెక్టు మ్యాథ్స్, బీఎస్సీ (బీజెడ్‌సీ) మేజర్ సబ్జెక్టు బోటనీ, మైనర్ సబ్జెక్టు హార్టీకల్చర్, బీకాం(కంప్యూటర్) అప్లికేషన్స్, బీఏ(హెచ్ఈపీ) మేజర్ పొలిటికల్ సైన్సు, మైనర్ సబ్జెక్టు హిస్టరీ గ్రూపులు ఉన్నాయని చెప్పారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థులు కళాశాలలో సంప్రదించాలని, ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కళాశాలలో చేరే విద్యార్థులకు విద్యాదీవెన, వసతి దీవెన వంటి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందవచ్చని తెలిపారు.

రైతులకు లాభసాటిగా మొక్కజొన్న

తాళ్లూరు (ముండ్లమూరు): మొక్కజొన్న పైరు ప్రతికూల పరిస్థితుల్లోనూ సాధారణ దిగుబడి ఇస్తోందని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. మండలంలోని కొర్రపాటివారి పాలెంలో శుక్రవారం క్షేత్ర పర్యటనలో భాగంగా మొక్కజొన్న నాటుతున్న పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ మొక్కజొన్న నాటిన 90 రోజుల్లో పంట చేతికొస్తుందన్నారు. మొక్కజొన్న నాటే సమయంలో బోదె వరుసల మధ్య 60 సెంటీమీటరు, సాళ్లలో మొక్కకు మొక్కకు 20 సెటీమీటర్లు ఎడం ఉండేలా విత్తనాన్ని నాటుకోవాలన్నారు. బోదె కుడివైపున నాటాలన్నారు. నీటిపారుదల సులభంగా ఉండేలా చూడాలన్నారు. విత్తిన పది రోజుల తర్వాత ఒత్తుగా మొలచిన చోట ఒక్కొక్క మొక్కను ఉంచి అదనంగా ఉన్న మొక్కలు తీసేయాలన్నారు.

స్వచ్ఛ భారత్ కార్మికుల నిరసన

గిద్దలూరు రూరల్: పట్టణంలోని అటవీశాఖ కార్యాలయం సమీపం అంబేడ్కర్ విగ్రహం ఎదుట శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండలంలోని గ్రామ పంచాయతీలకు చెందిన స్వచ్ఛ భారత్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన వ్యక్తం చేశారు. 10 నెలలకు చెందిన వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరారు. కనీస వేతనాలు రూ.21 వేలు ఇవ్వాలని, కార్మికులకు గుర్తింపుకార్డులు అందజేయాలన్నారు. సీఐటీయూ నాయకులు టి.ఆవులయ్య, పారిశుధ్య కార్మికులు ఆనందరావు, గోపాల్, నరసయ్య పాల్గొన్నారు.

సొంత నిధులతో డ్రైనేజీ పనులు

కురిచేడు: స్థానిక వినుకొండ రోడ్డులోని పెట్రోలు బంకు వద్ద డ్రైనేజీ పనులను సొంత ఖర్చులతో చేయించుకుంటున్నట్లు తొమ్మండ్రు సుబ్రహ్మణ్యం తెలిపారు. పడమర వీరాయపాలెం గ్రామ పంచాయతీ పరిధి ఎస్ఎస్‌పి కాలనీలో నీరు డ్రైనేజీలో నిల్వ చేరి తన పొలాల్లోకి చేరిందన్నారు. దుర్గంధం వెదజల్లుతూ పొలం పాడై పోతుండటంతో తాను స్వయంగా చేయించుకుంటున్నట్లు చెప్పారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



మృతి చెందిన గేదె

మార్కాపురం రూరల్: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని దరిమడుగు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. దరిమడుగు ఎస్సీ కాలనీకి చెందిన కవలకుంట్ల చిన్న చెన్నయ్యకు చెందిన గేదె తమ ఇంటికి సమీపంలో గడ్డి మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగ తగిలి గేదె మృతి చెందింది. రోజూ పాలు అమ్ముకుని జీవనం సాగిస్తున్నానని, న్యాయం చేయాలని చిన్న చెన్నయ్య విజ్ఞప్తి చేశాడు.

28న తెలుగు భాషా దినోత్సవం

ఒంగోలుమెట్రో: కళామిత్ర (తెలుగు లోగిలి) సంస్థ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక నారాయణ పబ్లిక్ స్కూల్, నిర్మల్ నగర్‌లో నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు డా.నూనె అంకమ్మరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ ముఖ్య అతిథిగా, గౌరవ అతిథులుగా కొల్లా సౌజన్య, కుర్రా ప్రసాద్‌బాబు, డా.సంతవేలూరి కోటేశ్వరరావు, మిడసల మలిఖార్జున రావు, తదితరులు పాల్గొంటారన్నారు. సాంస్కృతిక విభాగం పాత్రికేయులు బెజవాడ ప్రసాద్, శీలంకోట్టిరెడ్డి, డా.లంక ప్రసన్నకుమార్, సురపరాజు రాము శర్మ, వేసుపోగు కోటయ్యకు ఆత్మీయ సత్కారం ఉంటుందని తెలిపారు. యూవీ రత్నం, కోవెలకుంట్ల బాలకోటయ్య, ఒరుగంటి ప్రసాదులు నిర్వహణ సహకారాన్ని అందిస్తారని పేర్కొన్నారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



ఆనంద ఆశ్రమంలో పూజలు చేస్తున్న మహిళలు



వరలక్ష్మీ వ్రత పూజలు చేస్తున్న భక్తులు

మార్కాపురం: శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా పట్టణంలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం, శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక వరలక్ష్మి వ్రతాలు ఆచరించారు. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని పలు గృహాల్లో మహిళలు అమ్మవారి ప్రతిమ రూపొందించి, పూలతో అలంకరించి వరలక్ష్మి వ్రతాలు ఆచరించారు.

కొనకనమిట్ల: రావమ్మా మహాలక్ష్మి..రావమ్మా అంటూ శుక్రవారం మహిళలందరూ విశేష పూజలు నిర్వహించారు. ఇంట్లో వరలక్ష్మీదేవిని ప్రతిష్ఠించడంతోపాటు గోమాతలను పూజించారు. తోటి మహిళలను ఇంటికి ఆహ్వానించి పసుపు, కుంకుమ, జాకెట్లు, ఫలాలు అందించి వాయనాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

త్రిపురాంతకం: శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. త్రిపురాంతకం అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. ఆలయంలో ప్రత్యేకంగా కుంకుమార్చనలు చేశారు. శ్రీబాలాత్రిపురసుందరీదేవి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు ప్రసాదశర్మ భక్తులచే పూజాకార్యాక్రమాలు జరిపించి ప్రసాదాలు అందజేశారు. ఆలయాల ఈఓ చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూలైన్‌లో బారులు తీరారు.

గిద్దలూరు రూరల్: శ్రావణమాసం వరలక్ష్మి వ్రతం సందర్భంగా శుక్రవారం రోజు పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గర్భాలయంలోని అమ్మవారి మూలవిరాట్ మూర్తి అమ్మవారిని లక్ష్మీదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. ఉయ్యాల మండపంలోని అమ్మవారికి ఊయల సేవలు చేశారు. మహిళలు సామూహికంగా పాల్గొని వరలక్ష్మి వ్రత పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



వెంకటేశ్వరస్వామి ఆలయంలో వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు



గొట్లగట్టులో వాయనాలు ఇచ్చుకుంటున్న మహిళలు

బేస్తవారిపేట: స్థానిక త్రిలోక పుణ్యక్షేత్రం, గొట్లమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి ఆలయాల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం వేడుకలు నిర్వహించారు. త్రిలోక పుణ్యక్షేత్రంలోని రాజరాజేశ్వరి ఆలయంలో మహిళలు 108 కలశాలతో వరలక్ష్మి వ్రతం, కుంకుమార్చన, 108 కలశాలతో అభిషేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

స్థానిక త్రిలోక పుణ్యక్షేత్రంలోని సాయిబాబా ఆలయ 33వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి గిరీష్‌రెడ్డి తెలిపారు. పంచామృత అభిషేకాలు, అలంకరణ, కాగడ హారతి, అన్నదానం చేశారు.

దొనకొండ: మండలంలోని పలు గ్రామాల్లో శ్రావణ మాసంలో వచ్చే వరలక్ష్మి వ్రతాలను మహిళలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం తలంటి స్నానాలు చేసి భక్తిశ్రద్ధలతో ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. నైవేద్యాలు స్వీకరించారు. స్థానిక అడ్డరోడ్డులో వెలసిన ఆనంద ఆశ్రమంలో చుట్టు పక్కల గ్రామాల నుంచి మహిళలు విచ్చేసి పూజలు చేశారు. భైరవానంద స్వామి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.



త్రిపురాంతకంలో అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



కొనకనమిట్ల రామదూతక్షేత్రంలో పూజలు

యాజమాన్య పద్ధతులు పాటించాలి



పుస్తకాలు పంపిణీ చేస్తున్న అన్నపూర్ణ

పెద్దారవీడు: సాగు చేసిన పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులు తప్పనిసరిగా రైతులు పాటించాలని ఆత్మ పీడీ, జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త కె.అన్నపూర్ణ అన్నారు. మండలంలోని బదీ్వడుచెర్లోపల్లె రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి అధ్యక్షతన యాజమాన్య పద్ధతులపై రైతులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యాజమాన్య పద్ధతులు పాటిస్తే సాగు ఖర్చు తగ్గించుకుని నికర ఆదాయాన్ని పెంచుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలన్నారు. కంది, పత్తి, మిరప పంటల్లో ఆశించే గులాబీ రంగు పురుగుల నివారణ కోసం లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకుంటే పురుగుల ఉధృతి తగ్గించుకోవచ్చని తెలిపారు. పంటలకు సంబంధించిన సాంకేతిక సమాచార పుస్తకాలు రైతులకు పంపిణీ చేశారు. డీఆర్సీ అధికారి వి. శేషమ్మ, సర్పంచ్‌లు ఆకుమళ్ల శ్రీనివాసులరెడ్డి, కంచర్ల చెన్నమ్మ, రైతులు పాల్గొన్నారు.

ఏఎంసీ వైస్ చైర్మన్‌గా గంగయ్య బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న కండె గంగయ్య

కురిచేడు: దర్శి మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడిగా మండలంలోని గంగదొనకొండ గ్రామానికి చెందిన కండె గంగయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. దర్శి మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు మార్కెట్ కమిటీ కార్యదర్శి స్వాగతం పలికారు. గంగయ్య మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు రైతులకు అందిస్తానని పేర్కొన్నారు. కార్యదర్శి, నాయకులు పాల్గొన్నారు.

మూర్తిరెడ్డికి ఘన సన్మానం



మూర్తిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

యర్రగొండపాలెం: వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన ఏఎంసీ మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డికి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు శుక్రవారం శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. పార్టీ బలోపేతానికి ఆయన శక్తి వంచన లేకుండా కృషి చేస్తారన్నారు. జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎం.ఆదిశేషు, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, నాయకులు ఏకుల ముసలారెడ్డి, పప్పర్తి శ్రీనివాస్, ఒంగోలు సుబ్బారెడ్డి, టి.రాంబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కృష్ణారెడ్డి మృతి



పీవీ కృష్ణారెడ్డి(ఫైల్)

కొనకనమిట్ల: మండలంలోని వెలిగండ్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మన్, మాజీ సర్పంచ్ పాతకోట వెంకటకృష్ణారెడ్డి(75) గుండె పోటుతో శుక్రవారం హైదరాబాద్‌లో మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న కృష్ణారెడ్డి గుండెపోటుకు గురైనట్లు బంధువులు తెలిపారు. కృష్ణారెడ్డి తండ్రి శ్రీరాములరెడ్డి, కృష్ణారెడ్డి భార్య రత్తమ్మ కూడా సర్పంచ్‌లుగా పని చేశారు. మొత్తం 40 ఏళ్లపాటు కృష్ణారెడ్డి కుటుంబం గ్రామ సర్పంచ్‌లుగా కొనసాగారు. కృష్ణారెడ్డి గతంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా, పొదిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సేవలందించారు. కొనకనమిట్ల, పొదిలి మండల నాయకులకు వెన్నుదన్నుగా ఉంటూ వైఎస్సార్ సీపీ బలోపేతానికి తనవంతు కృషి చేశారు. కృష్ణారెడ్డి కుమార్తె ప్రస్తుతం బాపట్ల జిల్లా చీరాల ఆర్డీఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన వారసుడుగా కృష్ణారెడ్డి తమ్ముని కుమారుడు వెంకటరెడ్డి ప్రస్తుతం వెలిగండ్ల గ్రామ సర్పంచ్‌గా పనిచేస్తున్నారు.

నేడు వెలిగండ్లలో అంత్యక్రియలు

కృష్ణారెడ్డి భౌతికకాయానికి శనివారం సాయంత్రం ఆయన స్వగ్రామం వెలిగండ్లలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు బంధువులు తెలిపారు. ఉదయం పార్టీ అభిమానుల సందర్శనార్థం పొదిలిలో కృష్ణారెడ్డి నివాసం దగ్గర భౌతిక కాయాన్ని ఉంచుతున్నట్లు చెప్పారు. ఆయన మృతి చెందడం బాధాకరమని, పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి అన్నారు.

నిత్యావసరాల కల్తీ అరికట్టాలి

ఒంగోలు అర్బన్: ప్రజలకు అందించే వివిధ రకాల నిత్యావసర వస్తువుల్లో కల్తీ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని కల్తీలను అరికట్టేందుకు సంబంధిత శాఖలు సంయుక్తంగా దాడులు నిర్వహించాలన్నారు. శుక్రవారం పౌరసరఫరాలు, ఆహార భద్రత, తూనికలు కొలతల శాఖలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముఖ్యంగా వంట నూనెలు, పాలు, పప్పు ధాన్యాల్లో నాణ్యత ప్రమాణాలను పరిశీలించాలన్నారు. రాబోయే పది రోజుల్లో తనిఖీలు నిర్వహించి అవసరమైన మేరకు కేసులు నమోదు చేసి నివేదికలు అందజేయాలన్నారు. డీఎస్ఓ ఉదయ భాస్కర్, తూనికలు కొలతల అధికారులు, ఆహార భద్రతా అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటీలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

నేడు ఇగ్నైట్ యంగ్ మైండ్స్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి పోటీలు

మార్కాపురం టౌన్: ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ప్రారంభించిన ఇగ్నైట్ యంగ్ మైండ్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆగస్టు నెలకు సంబంధించి నియోజకవర్గ స్థాయి పోటీలను శనివారం ఉదయం 9.30 గంటలకు స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి జనార్దనరెడ్డి తెలిపారు. మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలని స్పష్టం చేశారు. వ్యాసరచన, క్విజ్, ఫోక్ డ్యాన్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థిని తండ్రికి నగదు అందజేస్తున్న దాతలు

మార్కాపురం: చదువుకుంటున్న పేద విద్యార్థినికి ఫీజు నిమిత్తం పట్టణ పోలీసుస్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న చెన్నుపల్లి కాశయ్య దాతల సహకారంతో సేకరించిన రూ.6 వేలను నగదును శుక్రవారం అందజేశారు. మార్కాపురం పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ ఖాశీంపీరా కుమార్తె చదువుకుంటోంది. కళాశాల ఫీజుకు సహకరించాలని చేసిన విజ్ఞప్తి మేరకు స్పందించిన కాశయ్య, దాతలు ఎం సుధీర్, జి.కిరణ్‌కుమార్, టి.గురునాథం, జి.రఘురామిరెడ్డి, సుబ్బారావు, పవన్ సహకారంతో నగదు అందజేశారు.

అమూల్ రైతులకు పాడి రుణాలు

తాళ్లూరు (ముండ్లమూరు): అమూల్ పాలకేంద్రాల్లో పాలు పోసే పాడి రైతులకు ప్రత్యేకంగా గేదెల కొనుగోలుకు రుణాలు మంజూరు చేయనున్నట్లు పీడీసీసీ బ్యాంకు మేనేజర్ పి.యోగేశ్వరరావు అన్నారు. మండలంలోని విఠలాపురంలో శుక్రవారం అమూల్ పాడి రైతులతో రుణమేళా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ పథకంలో భాగంగా అమూల్ కేంద్రాలకు పాలు పోస్తున్న రైతులందరికీ రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. సమావేశంలో సర్పంచ్ మారం ఇంద్రసేనారెడ్డి, బ్యాంకు సిబ్బంది రాము, యోగేశ్వరరావు, సిద్దయ్య, ఏపీఎం దేవరాజ్, రైతులు పాల్గొన్నారు.

కామూరి గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్సీ గోవిందరెడ్డి



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

కొమరోలు: గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు, మనోజ్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కామూరి రమణరెడ్డి కొమరోలులో నూతనంగా గృహాన్ని నిర్మించుకుని గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. కామూరి రమణరెడ్డి ఆహ్వానం మేరకు ఎమ్మెల్సీ గోవిందరెడ్డి శనివారం నూతన గృహంలో నిర్వహిస్తున్న పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు చేరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు మాజీ సైనికుల సమావేశం

కొమరోలు: స్థానిక మాజీ సైనికుల కార్యాలయంలో శనివారం మాజీ సైనికుల సమావేశం నిర్వహిస్తున్నట్లు మాజీ సైనికుల సంఘ మండలాధ్యక్షుడు అంబవరపు రామకృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని మాజీ సైనికులు, వితంతువులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. సమావేశంలో మాజీ సైనికులకు కేటాయించిన స్థలంలో భవన నిర్మాణంపై చర్చ జరుగుతుందని, శనివారం ఉదయం 10 గంటలకు సమావేశానికి హాజరు కావాలని కోరారు

ఎస్సీలను నిర్లక్ష్యం చేసింది టీడీపీ ప్రభుత్వం



మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

● వైఎస్సార్ సీపీ నాయకులు

యర్రగొండపాలెం: టీడీపీ ప్రభుత్వ కాలంలో ఎస్సీలను తీవ్రంగా నిర్లక్ష్యం చేయడంతో పాటు అనేక అవమానాలకు గురిచేశారని, వాళ్లను ఓటు బ్యాంకుగా వాడుకోవాలన్న ఉద్దేశంతో ఎన్నికల ముందు అరకొరగా పథకాలు అమలు చేశారని వైఎస్సార్ సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు ఆరోపించారు. మండలంలోని గంగపాలెంలో జరిగిన భవిష్యత్తుకు గ్యారెంటి కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌పై చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. ఈ సందర్భంగా స్థానిక రాజీవ్ అతిథి గృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జెడ్పీటీసీ, దళిత సంఘ నాయకుడు చేదూరి విజయభాస్కర్ మాట్లాడుతు రాష్ట్రంలో డప్పు కళాకారులు, చర్మ కారులకు తాను లిడ్ క్యాప్ చైర్మన్‌గా ఉన్న సమయంలోనే పింఛన్లు వచ్చాయని, మాదిగలకు టీడీపీతోనే న్యాయం జరిగిందని ఎరిక్షన్‌బాబు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019–20లో ఒక్కొక్కరికి రూ.3 వేల ప్రకారం 31 వేల మంది డప్పు కళాకారులకు పింఛన్లు ఇచ్చారని, అప్పటి నుంచి ఏటా డప్పు కళాకారుల సంఖ్య పెంచుకుంటూ ఇప్పటి వరకు 56 వేల మందికి పింఛన్లు అందజేస్తున్నారని చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబు వద్ద మెప్పు పొందేందుకు ఎరిక్షన్‌బాబు గ్రామాల్లో తిరుగుతూ దళితులను మభ్యపెట్టే మాటలు మాట్లాడుతున్నాడని, వారు గత పాలనలో పడిన ఇబ్బందులు ఇంకా మరచిపోలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎం.ఆదిశేషు, దళిత నాయకుడు తూమాటి రాంబాబు పాల్గొన్నారు.

బీసీల ఆరాధ్య నేత బీపీ మండల్



బీపీ మండల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీఎల్పీ యాదవ్, బీసీ సంఘాల నాయకులు

మార్కాపురం టౌన్: జాతీయ స్థాయిలో బీసీ రిజర్వేషన్లు అమలుకు కృషి చేసిన మండల కమిషన్ చైర్మన్, బిహార్ మాజీ ముఖ్యమంత్రి బీపీ మండల్ వెనుకబడిన కులాలకు ఆరాధ్య నేత అని బీసీ బ్రిలియంట్స్ కమ్యూనిటీ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీఎల్పీ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని బీసీ భవన్‌లో బీపీ మండల్‌యాదవ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మార్కాపురం పట్టణంలో బీసీ భవన్ మంజూరు చేయించిన ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి బీసీల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. పురపాలక సంఘ పరిధిలో బీపీ మండల్ విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు రంగస్వామి గౌడ్ టీపీ వెంకటేశ్వర్లు, బి.వెంకటేశ్వర్లు యాదవ్, న్యాయవాది పిన్నిక నాగార్జునప్రసాద్ యాదవ్, రాంబాబు, కాటంరాజు, రామచంద్రయాదవ్, రమణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.